

సంగంబండ రిజర్వాయర్ సమీపంలో తొలగించాల్సిన బండ రాయి ఇదే..

సంగంబండ తొలగింపునకు రంగం సిద్ధం

» బాధితులకు అందిన పరిహారం

» రేపు ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం, నీటి పారుదల శాఖ మంత్రి

మక్తల్, మార్చి 11: ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న సంగంబండ రిజర్వాయర్‌లోని బండ తొలగింపునకు రంగం సిద్ధమైంది. అన్ని అడ్డంకులు తొలగిపోవడంతో ఈనెల 13న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బండ తొలగింపు పనులను లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ బండ తొలగించకపోవడంతో ఎడమలో లెవల్ కాల్వ పనులు పూర్తికాక, 11 గ్రామాల పరిధిలో దాదాపు ఏడు వేల ఎకరాలకు సాగునీరు అందటం లేదు. భీమా ఎత్తిపోతల పథకంలో అంతర్భాగమైన సంగంబండ రిజర్వాయర్‌ను 3.317 టీఎంసీల సామర్థ్యంతో 75 వేల ఎకరాలకు నీరందించాలనే లక్ష్యంతో చేపట్టారు. రిజర్వాయర్ హైలెవల్ కెనాల్ ద్వారా ఇప్పటి వరకు మక్తల్, నర్వ, ఆత్మకూర్ మండలాల పరిధిలో 70 చెరువులను నింపుతున్నారు. కుడి కాల్వ ద్వారా మాగనూరు మండల పరిధిలో ఎనిమిది వేల ఎకరాలకు నీరిస్తున్నారు. కొన్ని చెరువులకు కూడా నింపుతున్నారు. కానీ ఎడమలో లెవల్ కెనాల్ పనులు పూర్తికాక మక్తల్ మండలంలోని గుర్లపల్లి, దాసర్‌పల్లి, వనాయకుంట, తిర్లపూర్, చందాపూర్, మాగనూరు మండలంలోని పెగడబండ, ఓబ్లాపూర్, పర్మాన్‌దొడ్డి, వడ్వాట్ గ్రామాల పరిధిలో ఏడు వేల ఎకరాలకు నీరు అందడం లేదు. సంగంబండ గ్రామానికి అతి చేరువలో 400ల మీటర్ల వెడల్పు ఉన్న బండరాయిని తొలగిస్తేనే ఈ కెనాల్ ద్వారా నీరందించడం సాధ్యమౌతోంది. ఈ పనులు చేపట్టేందుకు అప్పట్లో గుత్తేదారు వెళ్లగా.. సంగంబండ గ్రామస్థులంతా అడ్డుకున్నారు. తమకు పరిహారం అందించిన తర్వాతే పనులు చేపట్టాలని చెప్పారు. ఎట్టకేలకు పరిహారం డబ్బులు పంపిణీ చేయడంతో బండ తొలగించేందుకు అన్ని అడ్డంకులు తొలగిపోయాయి. గుర్లపల్లి, వనాయకుంట, దాసర్‌పల్లి గ్రామాల సమీపంలో వంతెనల పనులు కూడా అసంపూర్తి దశలో ఉన్నాయి. సంగంబండ ప్రాజెక్టు ద్వారా ఏడేళ్ల నుంచి 30 కిలో మీటర్ల దూరంలో ఉన్న నర్వ, ఆత్మకూర్ వంటి ప్రాంతాలకు నీరు వెళ్తున్నా.. బండ అడ్డుగా ఉండటంతో కూత వేటు దూరంలో ఉన్న తమకు మాత్రం అందడం లేదని సంగంబండతో పాటు పలు గ్రామాల ప్రజలు అంటున్నారు. బండను తొలగించనుడటంతో లో లెవల్ కెనాల్ పరిధిలోని 11 గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కలెక్టర్‌కు నామినేషన్ పత్రం అందిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి, మంత్రి, ఎమ్మెల్యేలు తదితరులు



నామినేషన్ పత్రం అందిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి, ఆ పార్టీ ఎమ్మెల్యే విజయుడు

ముగిసిన.. నామినేషన్లు

» స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోటీలో 16 మంది

» అట్టహాసంగా నామినేషన్ వేసిన కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి

» బీఆర్ఎస్ నుంచి నవీన్‌రెడ్డి దాఖలు..

» నేడు పరిశీలన.. రేపటి నుంచి ఉపసంహరణ

మహబూబ్‌నగర్, మార్చి 11: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు నామినేషన్ల పర్వం ముగిసింది. చివరి రోజు కోలాహలం నెలకొంది. ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు ఇండిపెండెంట్లు పలువురు నామినేషన్ల దాఖలు చేశారు. బీజేపీ మాత్రం పోటీకి దూరంగా ఉంది. మొత్తం 16 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు కాంగ్రెస్ నుంచి మన్నె జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి నామినేషన్లు వేశారు. నామినేషన్ పత్రాలను కలెక్టర్, ఎన్నికల అధికారి రవినాయక్ గుగులోత్ స్వీకరించారు. మంగళవారం నామినేషన్ పత్రాలు పరిశీలించనుండగా, 14వ తేదీవరకు ఉపసంహరణ గడువు ఉంది.

కదిలొచ్చిన కాంగ్రెస్ నాయకగణం

కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి నామినేషన్ వేసేందుకు పార్టీ ఉమ్మడి జిల్లా ప్రజా పతినిధులు, ముఖ్య నాయకులు తరలొచ్చారు. జీవన్‌రెడ్డి మూడుసెట్లు దాఖలు చేశారు. దాంతో కలెక్టరేట్ ప్రాంగణం నాయకులతో కిటకిటలాడింది. మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, వాకిటి శ్రీహరి, డాక్టర్ వంశీకృష్ణ, కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి, మేఘారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, మాజీ ఎంపీ మల్లు రవి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ వచ్చారు. వారితో పాటు నాయకులు సరిత, ఆనంద్ గౌడ్, వినోద్‌కుమార్, ఎన్‌పీ వెంకటేశ్, వసంత, కౌన్సిలర్లు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

స్థానిక ప్రజాప్రతినిధులతో ఊడిగం చేయించారు: జూపల్లి

బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు స్థానిక ప్రజాప్రతినిధులతో ఊడిగం చేయించిందని మంత్రి జూపల్లికృష్ణారావు అన్నారు. వారికి అధికారాలు, చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా స్థానిక సంస్థలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. నామినేషన్ అనంతరం మంత్రి అభ్యర్థి మన్నెజీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. అప్పులు చేసి, ఆస్తులు అమ్మి పనులు చేస్తే సంవత్సరాలైనా బిల్లులు ఇవ్వకపోవడంతో ప్రజా ప్రతినిధులు నిరాశా నిస్పృహలో ఉన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో వారందరికీ గౌరవం కల్పిస్తామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఏ విధంగానైతే అన్ని వర్గాల ప్రజలు ఏకతాటిపైకి వచ్చి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించారో, ఎమ్మెల్సీ ఎన్నికలు.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రెండు స్థానాలను భారీ మెజారిటీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 14 నియోజకవర్గాల కాంగ్రెస్ నాయకులమంతా ఏకతాటిపైన ఉన్నామని, పార్టీ అభ్యర్థులను గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ నాయకులు అవకాశం ఇచ్చారని, పార్టీ అధినేత సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యేలతో కలిసి నామినేషన్ వేసిన నవీన్‌రెడ్డి

బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడుతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నాయకులెవరూ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనలేదు. నవీన్‌రెడ్డి రెండు సెట్లు నామినేషన్ దాఖలు చేశారు. వీరితోపాటు సదర్శన్, లక్ష్మి, సుమలత, మంగి విజయ్, శంకర్ నాయక్, కృష్ణ, కుమార్, మున్నూరు రవి, గవినోళ్ల బాల్‌రాంరెడ్డి, లక్ష్మీరెడ్డి, మహ్మద్ రహీం ఖాన్, శ్రీకాంత్ పిల్లెల, దేవీ రవిందర్, ఆర్.జీవన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి నామినేషన్ వేసిన వారిలో ఉన్నారు. 16 మంది 28 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.

విజయం మాదే: బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌రెడ్డి

ఉమ్మడి పాలమూరు జిల్లాలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులంతా బీఆర్ఎస్ నుంచి గెలిచిన వారేనని, సంఖ్యాబలం ఉన్నందున విజయం తమదేనని బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. నామినేషన్ అనంతరం ఆయన ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. బలం లేకున్నా, రాజకీయ అనుభవం లేకున్నా డబ్బులతో ప్రలోభాలకు గురిచేయవచ్చని కాంగ్రెస్ భావిస్తోందని.. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ప్రలోభాలకు లొంగరని చెప్పారు. తాను ఉమ్మడి జిల్లా జడ్పీ మాజీ చైర్మన్‌గా పనిచేసినందున స్థానిక సంస్థలపై పూర్తి అవగాహన ఉందన్నారు. వారి సమస్యలు పరిష్కరించాలంటే తనను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్‌కు పూర్తి మెజారిటీ ఉన్నదని, వారందరి మద్దతుతో నవీన్‌రెడ్డి విజయం సాధిస్తారన్నారు.



చేప పిల్లలను వదిలారని చెబుతున్న ఎండిపోయిన జిల్లడబండ చెరువు

నేటి నుంచి రంజాన్ మాసం

» కనిపించిన నెలవంక » నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు



ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధమైన నారాయణపేటలోని మదీనా మసీదు



నారాయణపేట/ ఊట్కూర్, మార్చి 11: నెలవంక సోమవారం కనిపించడంతో మంగళవారం తెల్లవారు జాము నుంచే పవిత్ర రంజాన్ మాసం మొదలు కానుంది. రంజాన్ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మసీద్‌లను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ముస్లింలు రోజూ ఐదు సార్లు నమాజ్ చేయనున్నారు. ఈ నెల రోజులు ఉపవాసం ఉండటం ద్వారా కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సర్యాలు అదుపులో ఉండి, మనో నిగ్రహం ఏర్పడుతుందని ముస్లింలు భావిస్తారు.

ఐదు సార్లు నమాజ్..

పండుగ సమయంలో ముస్లింలు రోజుకు ఐదుసార్లు నమాజ్ చేస్తారు. తెల్లవారుజామున, మధ్యాహ్నం, సాయంత్రం, సూర్యాస్తమయం తర్వాత, అనంతరం రాత్రి 8.30 గంటలకు నమాజ్ చేస్తారు. నమాజ్‌లను ఫజల్, జుహర్, అసర్, మగ్రిబ్, ఈషాలుగా అభివర్ణిస్తారు. ముస్లింలు ఏడాది పాటు ఆర్జించిన ఆదాయంలో రెండున్నర శాతం జకాత్‌లో భాగంగా నిరుపేదలకు నగదు రూపేణా దాన ధర్మాలు చేస్తే మంచి జరుగుతుందని నమ్ముతారు. ఈ దాన ధర్మాలు ఏడాదిలో ఎప్పుడైనా చేయచ్చు. రంజాన్ మాసంలో చేస్తే రెట్టింపు పుణ్యం లభిస్తుందని భావిస్తారు.

ఉద్యోగులకు గంట ముందే మినహాయింపు

వివిధ శాఖల్లో పని చేస్తున్న ముస్లిం ఉద్యోగులకు రంజాన్ మాసం దృష్ట్యా రాష్ట్రం ప్రభుత్వం మార్చి 12 నుంచి ఏప్రిల్ 11 వరకు సాయంత్రం నాలుగు గంటలకే విధుల నుంచి వెళ్లేందుకు వెసులు బాటు కల్పించింది. ఈ మేరకు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

చేప పిల్లల పంపిణీలో.. మాయాజాలం

» నీళ్లు లేని చెరువులు, కుంటల్లో వదిలినట్లు సంతకాలు

» 1.78 కోట్ల చేప పిల్లలకు రూ.2.39 కోట్ల బిల్లులు

» రికార్డుల్లో రూ.20.78 కోట్ల మత్స్య సంపద ఉత్పత్తి అయినట్లు వెల్లడి

» మత్స్యకారుల కుటుంబాల్లో రాని మార్పు

» విచారణ చేస్తే అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం

గద్వాల, మార్చి 11: జోగుళాంబ గద్వాల జిల్లాలో ఉచిత చేప పిల్లల పంపిణీలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఈ ఏడాది వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో చాలా చెరువులు, కుంటల్లోకి నీళ్లు రాలేదు. కానీ జిల్లాలో 1.78 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేశారని రికార్డులు చెబుతున్నాయి. క్షేత్ర పరిశీలనలో కొన్ని చెరువులు, కుంటలకు రెండు మూడేళ్లుగా నీళ్ల రాలేదని తెలుస్తోంది. వాటిలోనూ చేప పిల్లలను



చేప పిల్లల విడుదల తర్వాత ఎండిపోయిన సంగాల రిజర్వాయర్



రెండేళ్లుగా నీళ్లు రాని గోనుపాడు వేములకుంటలో చేప పిల్లలను వదిలినట్లు రికార్డుల్లో పేర్కొన్నారు..

వదిలినట్లు సంబంధిత చెరువు కమిటీ అధ్యక్షులతో సంతకాలు తీసుకోవడం కొసమెరుపు. కాంగ్రెస్ ప్రభుత్వం గొర్రెలు, ఉచిత చేప పిల్లల పంపిణీలో అక్రమాలపై ఏసీబీ విచారణకు ఆదేశించడంతో అక్రమార్కులు, అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

ఎలాంటి మార్పూ లేదు

జిల్లాలో 87 మత్స్య పారిశ్రామిక సంఘాలు ఉండగా, అందులో 6,030 మంది సభ్యులు ఉన్నారు. 52 ప్రాథమిక మత్స్య సహకార సంఘాలు ఉండగా 4,229 మంది సభ్యులు, నాలుగు మహిళా మత్స్య పారిశ్రామిక సంఘాలు ఉండగా అందులో 229 మంది సభ్యులు ఉన్నారు. ఇటీవల 2,234 మందికి వృత్తి నైపుణ్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 682 మందిని ఎంపికచేసి సభ్యత్వం కల్పించారు. ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి పథకాలు అందడం లేదని చెబుతున్నారు.

ఏడేళ్లుగా అక్రమాలు

జిల్లాలో చేప పిల్లల పంపిణీలో ఏడేళ్లుగా అక్రమాలు జరుగుతున్నాయి. మొత్తం ఆరు రిజర్వాయర్లు, జూరాల, శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో పాటు 35 మత్స్యశాఖ చెరువులు, 396 గ్రామాల్లో చెరువులు, కుంటలు ఉన్నాయి. ఈ ఏడాది 1.78 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేశారు. అయితే ఈ సారి వర్షాలు సక్రమంగా లేకపోవడంతో మెజారిటీ చెరువులు, కుంటల్లోకి నీళ్లు చేరలేదు. కొన్నింటికి రెండు నుంచి మూడేళ్లుగా నీళ్లు రాలేదు. ఎండిపోయే స్థితిలో ఉన్న చెరువులు, కుంటల్లో చేప పిల్లలను వదిలినట్లు రికార్డులు తయారు చేశారు.

సమాచారం ఇవ్వలేదు

చేప పిల్లల విడుదల సమయంలో మొదటి రోజు మాత్రమే సమాచారం ఇచ్చారు. చెరువుల్లో నీళ్లు లేవని చెప్పినప్పటికీ నామాటలను పట్టించుకోలేదు. కాంట్రాక్టర్లు తెచ్చే చేప పిల్లల లెక్కలను ఇష్టానుసారంగా రాశారు. కాంట్రాక్టర్లు, అధికారులకు మేలు జరిగింది తప్ప ఈ ఏడాది మత్స్యకారులకు నష్టమే జరిగింది. చేపపిల్లల పంపిణీపై విచారణ చేయాలి.

- గోపాల్, జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు

పూర్తి స్థాయిలో వదిలాము

జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులు, కుంటలలో పూర్తి స్థాయిలో చేప పిల్లలను వదిలాము. 35-40 ఎంఎం చేప పిల్లలను చెరువులు, కుంటల కమిటీలకు పంపిణీ చేశాము. సంతకాలు, ఫొటోలు ఉన్నాయి. వారు అందులో వదిలారా? లేదా? అనేది చూడలేదు. చెరువులు, కుంటల్లో ఉన్న నీళ్లు ఎండిపోతే నేనేం చేయాలి. చేప పిల్లలను మరోచోటికి డంప్ చేసి ఉంటారు. సంగాల, ముచ్చోనిపల్లి రిజర్వాయర్లలో కూడా వదిలాము. రైతులు నీళ్లను ఖాళీ చేస్తే చేప పిల్లలను మత్స్యకారులు పట్టుకుపోయి ఉంటారు.

- షకీలాబాను, జిల్లా మత్స్యశాఖ అధికారి

మచ్చుకు కొన్ని..

గద్వాల మండలం జిల్లడబండ చెరువులోకి ఈ ఏడాది నీళ్లు రాలేదు. ఇందులో 80-100ఎ ంఎం సైజు గల 1,79,998 చేప పిల్లలను విడుదల చేసినట్లు చెబుతున్నారు. అందుకోసం రూ.2,86,196 బిల్లు పెట్టారు. ఇదే మండలం పూడూరులోని శివునికుంట, నాగుల చెరువు, బక్కమ్మ చెరువులలో నీళ్లు లేవు. కానీ ఈ మూడింటిలో 4,04,125 చేప పిల్లలను విడుదల చేసినట్లు రూ.6,42,668 బిల్లు పెట్టారు. ఇదే మండలం గోనుపాడులో వాముల కుంట, బాపని కుంట, సుధాబావి కుంట, ఏకులబావి కుంటలో మూడేళ్లుగా నీళ్లు లేవు. వాటిలో దాదాపు 50 వేల చేపపిల్లలను వదిలినట్లు రూ.29,500 బిల్లు పెట్టారు.

- సంగాల రిజర్వాయర్‌లో చేపలు పట్టుకోవడంలో వివాదం ఉంది. వీటిలో 6,18,000 చేప పిల్లలను వదిలారు. అందుకు రూ.9,82,620 బిల్లు పెట్టారు. ఇప్పుడు ఇందులో నీళ్లు లేవు. రైతులు మోటార్ల ద్వార వ్యవసాయ పొలాలకు తరలించుకుపోయారు. చేప పిల్లలు వృథా అయ్యాయి.
- ముచ్చోనిపల్లి రిజర్వాయర్‌లో కూడా చేపలు పట్టడంలో వివాదం ఉంది. వీటిలో 13,62,583 చేప పిల్లలను వదిలారు. ఇందుకోసం రూ.21,66,506 బిల్లు పెట్టారు. ఇక్కడా నీటిని రైతులు మోటార్ల ద్వార తరలించుకుపోవడంతో చేప పిల్లల పంపిణీ వృథాగా మారింది. ఇవి మచ్చుకు ఉదాహరణలు మాత్రమే. ఇలాంటి ఘటనలు జిల్లాలో చాలా ఉన్నాయి.

లెక్కల్లోనే సంపద సృష్టి

ఉచిత చేప పిల్లల పంపిణీ వలన మత్స్య సంపద సృష్టించబడి రూ.కోట్లల్లో ఆదాయం పొందుతున్నారని అధికారులు రికార్డుల్లో పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన గణాంకాల్లో 2020-21లో 21,248 టన్నుల చేపలు ఉత్పత్తి అయ్యి.. రూ.13.33 కోట్ల ఆదాయం పొందారని, 2021-22లో 30,871 టన్నుల చేపలు ఉత్పత్తి జరుగగా రూ.19.62 కోట్ల ఆదాయం పొందారని తెలిపారు. కానీ గ్రామాల్లో మత్స్యకారుల పరిస్థితి అందుకుభిన్నంగా ఉంది. ఉపాధి కరువై కుటుంబ పోషణ కోసం వారు వ్యవసాయ కూలీలుగా మారుతున్నారు.

పట్ట పగలు చోరీ

» 22 తులాల బంగారం, 50 తులాల వెండి, రూ.30 వేల నగదు అపహరణ

వడ్డేపల్లి, మార్చి 11: జోగుళాంబ గద్వాల జిల్లా శాంతినగర్ టీచర్స్ కాలనీలో సోమవారం పట్ట పగలే చోరీ జరిగింది. బాధితుడు మక్బూల్ బాషా తెలిపిన వివరాల ప్రకారం.. శాంతినగర్ టీచర్స్‌కాలనీలో మక్బూల్ బాషా భార్య పిల్లలతో నివాసం ఉంటున్నాడు. మండల కేంద్రం ఉండవల్లిలో ప్రైవేటు పాఠశాల నిర్వహిస్తున్నాడు. రోజూ మాదిరిగా సోమవారం పాఠశాలకు బయల్దేరి, సాయంకాలం ఇంటికి చేరుకున్నారు. ఇంటి తాళం విరిగిపోయి ఉండటంతో లోపలికి వెళ్లి చూశారు. బెడ్ రూంలో ఉన్న బీరువా తాళం కూడా విరగొట్టి కనిపించింది. అందులోని 22 తులాల బంగారం, 50 తులాల వెండి నగలు, రూ.30 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. శాంతినగర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ రత్నం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇంట్లో ఏయే వస్తువులు పోయాయన్నది బాధితుడు పరిశీలిస్తున్నాడని సీఐ చెప్పారు. డాగ్ స్క్వాడ్‌ను రప్పించి, క్లూస్ సేకరించి వివరాల ఆధారంగా విచారణ చేపట్టి తుదుపరి చర్యలు తీసుకుంటామని వివరించారు.

కష్టకాలంలో పని చేసిన వాళ్లే.. కార్యకర్తలు

» మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, మార్చి 11: కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీ కోసం కష్టపడి పనిచేసే వాళ్లే అసలైన కార్యకర్తలని, వారి సేవలకు గుర్తింపు ఉంటుందని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం పట్టణంలోని జేజేఆర్ గార్డెన్‌లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి సన్నాహక సదస్సు నిర్వహించారు. సదస్సులో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డితోపాటు పార్లమెంట్ పరిధిలోని మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ పదేళ్లు అన్నీ అనుభవించి, లబ్ధిపొంది.. అధికారం పోగానే పార్టీ మారి ప్రజల్లోకి వస్తే వారిని ప్రజలు శభాష్ అంటారా?.. ఛీ కొడతారా? అనేది ఆలోచన చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ హామీలను నమ్మి మోసపోయిన ప్రజలు ఆ పార్టీకి అధికారం ఇచ్చారని, ఇప్పుడు వారికి కష్టాలు మొదలయ్యాయని అన్నారు. కరెంట్ లేక పంటలు ఎండుతున్నాయన్నారు. బస్సుల్లో సీట్లు దొరకడం లేదని, కొత్త బస్సులు వేయాలని డిమాండ్ వస్తోందని, పింఛన్లు రావడం లేదని బాధపడుతున్నారని చెప్పారు. మళ్లీ ఎన్నికలు వస్తే బీఆర్ఎస్‌కు ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ ఎన్నికలు ఇజ్జత్‌కే సవాల్ అని, కచ్చితంగా పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. అధికార పార్టీ డబ్బులు ఇచ్చి మాయ చేస్తుందని.. డబ్బులు తీసుకోవద్దని చెప్పారు. తీసుకున్నా తల్లిలాంటి పార్టీకే ఓటువేయాలని చెప్పారు.

నేనే స్థానికుడిని: ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న వారిలో తాను మాత్రమే స్థానికుడినని బీఆర్ఎస్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ స్థానికేతరుడికి టికెట్ ఇచ్చిందని, బీజేపీలో పోటీపడే వాళ్లు కూడా స్థానికేతరులేనని చెప్పారు. తనను మరోసారి ఆశీర్వదిస్తే సమస్యలు పరిష్కరిస్తానని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సి.లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, అంజయ్య యాదవ్, చిట్టెం రాంమోహన్‌రెడ్డి, ఎస్ రాజేందర్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి, నాయకులు రాజేశ్వర్‌గౌడ్, కేరమోని నర్సింహులు పాల్గొన్నారు.







బావిలో మృతదేహం లభ్యం




రాముడు(ఫైల్)

వంగూరు, మార్చి 11: నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని రంగాపూర్ గ్రామ శివారులో పడావు బావిలో వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. రఘుపతిపేటకు చెందిన రాముడు (36) భార్యతో కలసి అత్తగారి ఊరైన రంగాపూర్‌కు ఈ నెల 8న ఉదయం వచ్చారు. రాముడు మామతో కలిసి పొలం వద్దకు వచ్చాడు. అల్లుడు ఇంటికి రానని చెప్పడంతో వదిలేసి వెళ్లాడు. రాముడు 9వ తేదీ వరకు ఆచూకీ తెలవక పోవడంతో వారి కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు అతని ఆచూకీ కోసం వెతకసాగారు. రంగాపూర్ గ్రామ శివారులో మొకురాలకు వెళ్లే రోడ్డులో ఎరుకలి రామస్వామి పొలంలోని పడావు బావిలో పడి ఉన్న రాముడు మృతదేహాన్ని పోలీస్‌లు గుర్తించారు. మృతదేహం కుల్లిపోయింది. మృతునికి మతిస్థిమితం సరిగ్గా లేదని ఈ కారణం చేతనే బావిలోపడి మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నారు. మృతునికి భార్య జ్యోతి, కుమారుడు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ మహేందర్ తెలిపాడు.

సామాజిక తనిఖీలో రూ.23,590 వేలు రికవరీ

భూత్పూర్, మార్చి 11: మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో 2022-23 సంవత్సరానికి సంబంధించి జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ప్రత్యేక అధికారిగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నర్సిములు, ఎస్‌ఎం హేమలత, అడిషనల్ పీడీ ముసాయిదాబేగం, ఏపీడీ మంజుల తదితరులు హాజరయ్యారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో జరిగిన కూలీల పనుల వివరాలను గ్రామాల వారిగా సామాజిక తనిఖీ బృందం సభ్యులు తయారు చేసిన నివేదికను వెల్లడించారు. మండలంలో జరిగిన మొత్తం రూ.3,52,79,117కోట్లు కూలీలకు, సామానులకు ఖర్చు చేసినట్లుగా అధికారులు లెక్క చెప్పారు. అయితే సామాజిక తనిఖీల్లో తేలిన లెక్క ప్రకారం రూ.23,590 ఉపాధి హామీ పనుల్లో సిబ్బంది చేసిన అవతవకలను రికవరీ చేశామని, అదేవిధంగా రూ.15000 సిబ్బందికి అపరాధరుసుము కింద చెల్లించాల్సి ఉంటుందని అధికారులు లెక్క తేల్చారు. సమావేశంలో ఎంపీడీవో ప్రభాకర్, ఏపీవో విమల, టెక్నిల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెట్లు, తదితరులు పాల్గొన్నారు.











గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


జంగయ్య (ఫైల్)

చారకొండ, మార్చి 11: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని జూపల్లిలో జాతీయ రాహదారిపై చోటు చేసుకొంది. ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సిర్సనగండ్ల గ్రామానికి చెందిన బచ్చనమోని జంగయ్య (50) ఆదివారం జూపల్లిలో తన చెల్లెలు ఇంటికి వెళ్లాడు. తిరిగి సిర్సనగండ్లకు వ చ్చేందుకు రాత్రి సమయంలో జాతీయ రాహదారిపై నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో జంగయ్యకు కుడి కాలు విరిగిపోయింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో గమనించిన గ్రామస్థులు అతని బంధువులకు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. 108కి సమాచారం ఇవ్వడంతో అంబులెన్సులో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య జంగమ్మ, ఇద్దరు కుమారులున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

కోడేరు, మార్చి 11 : మండల పరిధిలోని జనుంపల్లి గ్రామంలో సోమవారం డ్రైవర్ నిర్లక్ష్యంతో ట్రాక్టర్ బోల్తా పడగా త్రుటిలో ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం... అదే గ్రామానికి చెందిన బర్లలింగస్వామి ట్రాక్టర్‌ను డ్రైవర్ మహిమూద్ డ్రైవింగ్ చేస్తూ ప్రమాదవశాత్తు బస్టాండ్ సమీపంలో రోడ్డు కిందకు ట్రాక్టర్ పోవడంతో ట్రాక్టర్ ఇంజన్ వరకు బోల్తాపడిందని డ్రైవర్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదన్నారు. స్థానికులు వెంటనే వచ్చి ట్రాక్టర్‌ను జేసీబీ సహాయంతో తీశారని అన్నారు.

వే ఫేక్ యాప్

- రూ.లక్షలు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు
- వట్టెంలో 150 మంది వరకు బాధితులు
- అత్యాశకు పోయి రూ.లక్షలు పోగొట్టుకున్న వైనం
- ఎవరికైనా చెప్పుకుంటే పరువుపోతుందని సైలెంట్
- అల్లీపూర్‌లో మరికొంత మంది వేక్ యాప్ బాధితులు
- ఫేక్ అని తెలియడంతో లబోదిబోమంటున్న బాధితులు

బిజినేపల్లి, మార్చి 11 : సైబర్ నేరగాళ్లకు అత్యాశకు పోయే అమాయకులే పెట్టుబడి. వారి అత్యాశకు ఎరవేసి నమ్మించి ఉన్నదంతా దోచుకొని గుట్టు చప్పుడు కాకుండా బోర్డు తిప్పేస్తారు. ఇలాంటి ఘటనలపై పోలీసు శాఖ, స్వచ్ఛంద సంస్థలు, మీడియా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నా తక్కువ పెట్టుబడితో, తక్కువ కాలంలో ఎక్కువ సంపాదనకు ఆశపడి అజ్ఞాత వ్యక్తులు ఆన్‌లైన్‌లో మోసపోతూనే ఉన్నారు. రూపాయికి వంద రూపాయలు ఆదాయం వస్తుందని నమ్మించడంతో ఎలాంటి వివరాలు తెలుసుకోకుండా వారి ట్రాప్‌లో పడి ఉన్నదంతా ఆన్‌లైన్ యాప్‌లో ఊడ్చిపెడుతున్నారు. ఈ కోవలోనే నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని వట్టెం గ్రామానికి చెందిన దాదాపు 150 మంది వరకు అమాయకులు వేక్‌యాప్ ద్వారా రూ.20 లక్షలు పోగొట్టుకున్న ఘటన వెలుగులోకి వచ్చింది.


పేరు చెప్పేందుకు ఇష్టపడని పలువురు బాధితులు సోమవారం తెలిపిన వివరాల మేరకు.. వేక్ యాప్‌లో పెట్టుబడి పెడితే పెట్టిన పెట్టుబడికి తగినట్టుగా రోజుకు పదిశాతం ఆదాయం మీ ఖాతాలో జమ చేస్తామని నమ్మించారు. అందుకు ముందుగా రూ.800లతో ఖాతా తెరిచి బ్యాంక్ వివరాలు, ఆధార్, పాన్‌కార్డు, ఫోన్‌నెంబర్ వంటి వ్యక్తిగత వివరాలు నమోదు చేసికొని నంబరుషిప్ నమోదు చేసుకోవాలి. ఆ తర్వాత ఎంత మొత్తం పెట్టుబడి పెడితే ఆ పెట్టుబడిపై బాధితులు ఎంపిక చేసుకున్న ప్లాన్ ప్రకారం రోజు వారీగా ఆదాయం జమ అవుతుందని నమ్మించారు. అందుకు అనుగుణంగానే నాలుగైదు రోజుల పాటు కొందరికి జమ చేసి నమ్మించారు. డబ్బులు వచ్చిన వారు కష్టపడకుండానే ఆదాయం వస్తుందని చెప్పడంతో మరికొంత మంది వేక్‌యాప్‌లో వేలల్లో పెట్టుబడి పెట్టారు. ఉదాహరణకు రూ.70 వేలు పెట్టుబడి పెడితే రోజుకు రూ.7 వేల చొప్పున 58 రోజులు పాటు రూ. 4 లక్షలకు పైగా ఆదాయం వస్తుందని ఆశ చూపారు. అతి తక్కువ కాలంలో తక్కువ పెట్టుబడికి ఎక్కువ ఆదాయం వస్తుందని అత్యాశకు పోయి లక్షల డబ్బులు యాప్‌లో పెట్టి మోసపోయామని తెలుసుకొని లబోదిబోమని బోరున విలపిస్తున్నారు. మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన కొందరు వేక్‌యాప్ డబ్బులు పోగొట్టుకున్నట్లు తెలుస్తోంది. పోలీసులు వేక్‌యాప్‌పై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

అజ్ఞాత వ్యక్తులను నమ్మి డబ్బులు వేసి మోసపోవద్దు



వట్టెం, అల్లీపూర్ గ్రామాలకు చెందిన కొందరు వేక్ యాప్‌లో డబ్బులు పె ట్టి మోసపోయారని సోషల్ మీడియాలో ప్రచారం సాగుతున్నది. కానీ ఇప్పటి వరకు ఒక్క బాధితుడు కూడా ఫిర్యాదు చేయలేదు. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేస్తున్నాం. అలాగే అజ్ఞాత వ్యక్తులు ఎవరైనా ఫోన్ చేసి తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం అందిస్తామని చెబితే వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫోన్ కాల్ డిటేల్స్ ఇవ్వాలి. అత్యాశకు పోయి ఆన్‌లైన్‌లో గుడ్డిగా ఖాతా నుంచి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేస్తే సైబర్ నేరగాళ్ల చేతుల్లో మోసపోతారు. ఆన్‌లైన్ వ్యాపారాల పేరుతో బ్యాంక్, ఆర్బీఐ రూల్స్ అంటూ ఎవరైనా ఫోన్ చేసి ఓటీపీ, బ్యాంక్ ఖాతా వివరాలు అడిగితే ఇవ్వకూడదు. ఏ చిన్న అనుమానం కలిగినా పోలీసులు సమాచారం ఇవ్వాలి. గ్రామాల్లో ఆన్‌లైన్‌లో జరిగే మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పిస్తున్నాం.

- నాగేశ్వర్ రెడ్డి, ఎస్సై, బిజినేపల్లి



ఆన్‌లైన్‌లో రోజువారీగా ఆదాయం లెక్కలు చూపుతున్న యాప్

డ్యూటీకి వెళ్తూ గుండెపోటుతో ఉద్యోగి మృతి

అలంపూర్ చౌరస్తా, మార్చి 11 : డ్యూటీకి వెళ్తూ మార్గంమధ్యలో గుండెపోటుతో ఓ ఉద్యోగి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం అలంపూర్ చౌరస్తాలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాదు నగరంలోని చంద్రాయణగుట్టకు చెందిన సయ్యద్ నూరల్ అంబియ (55) వడ్డేపల్లి పాలిటెక్నిక్ కళాశాలలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. మూడు రోజులు వరుసగా సెలవులు ఉండటంతో హైదరాబాద్‌కు వెళ్లి సోమవారం తెల్లవారుజామున బస్సెక్కి కళాశాలకు బయలుదేరాడు. అలంపూర్ చౌరస్తాలో బస్సు దిగిన సయ్యద్ కాస్త అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే అక్కడే ఉన్న ఓ ప్రైవేట్ క్లినిక్‌కు వెళ్లి షుగర్ టెస్టు చేయించు కున్నాడు. తన పరిస్థితిని తోటి సిబ్బందిలో ఒకరైన జూనియర్ అసిస్టెంట్ నాగరాజుకు ఫోన్ చేసి తెలిపారు. కాసేపటికే తాను కూర్చున్న బెంచిపైనే కుప్పకూలిపోయాడు. గమనించిన డయాగ్నోస్టిక్ సెంటర్ సిబ్బంది సీపీఆర్ చేశారు. ఫలితం లేకపోవడంతో 108కు, కళాశాల ఉద్యోగులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే పల్స్ పడిపోయినట్లు 108 సిబ్బంది నిర్ధారించారు. సమాచారం తెలుసుకున్న సదరు కాలేజీ ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్, ఇతర సిబ్బంది అక్కడికి చేరుకుని పోలీసుల కు సమాచారం ఇచ్చారు. ఉండవల్లి ఎస్ఐ కె.శ్రీనివాసులు ఘటనా స్థలానికి చేరుకుని కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అలంపూర్ ఆసుపత్రికి తరలించారు. అతడికి భార్య ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్దకొడుకు సయ్యద్ నూరల్ రహమాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


మృతి చెందిన సయ్యద్ నూరల్ అంబియ

పొలంలో మొసలి కలకలం

- జూరాల ప్రాజెక్టులో వదిలిన అధికారులు

ధరూరు, మార్చి 11 : ధరూరు మండల పరిధిలోని ర్యాలంపాడు శివారులో రంగారెడ్డి అ నే రైతు పొలంలోని ముళ్ల చెట్ల పొదల్లో సోమవారం భారీ మొసలి కనిపించింది. గ్రామస్థులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానికులు పనుల నిమిత్తం పొలానికి వెళ్తుండగా ముళ్లపొదల మధ్య మొసలి కనిపించడంతో భయాందోళనలకు గురయ్యారు. అప్రమత్తమైన గ్రామస్థులు దాన్ని తాళ్లతో బంధించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని మొసలిని తీసుకెళ్లి జూరాల ప్రాజెక్టులో విడిచిపెట్టారు. ర్యాలంపాడు రిజర్వాయర్‌లో నీరు అడుగంటడంతో మొసలి పొలంలోకి వచ్చిందని గ్రామస్థులు తెలిపారు.


మొసలిని తాడుతో బంధిస్తున్న గ్రామస్థుడు

సమస్యలు పరిష్కరిస్తా

● ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సర్వసభ్య సమావేశంలో ఆర్ఎం శ్రీదేవి

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 11 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ వి. శ్రీదేవి అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని పారిశ్రామిక వాడలోని ఫోరం కార్యాలయంలో ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు అధ్యక్షతన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్ఎం పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. జిల్లా పరిధిలోని వివిధ డిపోలకు చెందిన కారుణ్య నియామకాలను త్వరలో చేపడతామని, విశ్రాంత ఉద్యోగులకు మందులు కొరత లేకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో నాగర్‌కర్నూల్ డివిజన్ పాలెంలో మరో ఆర్టీసీ క్లినిక్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆమె తెలిపారు. పర్సనల్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రీజియన్ పరిధిలోని విశ్రాంత ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విశ్రాంత ఉద్యోగుల జీవితం కాలం ప్రయాణపు ఐడెంటిటీ కార్డులను ఆర్ఎం అందజేశారు. అనంతరం ఆర్ఎం, పీవోలను సన్మానించారు. సమావేశంలో టీఎంయూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి. లక్ష్మణ్‌గౌడ్, నాయకులు నారాయణ, ఉమేష్ కుమార్, భగవంతు, నాగాంజనేయులు, మోహన్‌రెడ్డి, బీహెచ్ కుమార్, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.



ఆర్టీసీ విశ్రాంతి ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎం శ్రీదేవి

ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు

మల్దకల్, మార్చి 11 : విద్యాబుద్ధులు నేర్పి విద్యార్థులకు ఉజ్వల భవిషత్తును అందించాల్సిన ఉపాధ్యాయుడి మనసు గతి తప్పింది. విద్యార్థినులతో వెకిలి చేష్టలు చేసి, చివరకు కటకటాల పాలయ్యాడు. మల్దకల్ ఎస్ఐ సురేష్ గౌడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న వ్యక్తి కొంత కాలంగా విద్యార్థినులతో వెకిలి చేష్టలు చేయడమే కాకుండా, మానసికంగా వేధిస్తున్నాడు. దీంతో వారు తల్లిదండ్రులు, జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. శిశు సంక్షేమ శాఖ ఉద్యోగి సురేశ్ ఫిర్యాదుతో నిందితునిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

గడ్డివాము దగ్ధం

ఉండవల్లి, మార్చి 11 : మండల కేంద్రంలోని విఠల్‌బాబుకి చెందిన గడ్డివాము ప్రమాదవశాత్తు దగ్ధమైంది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రైతు విఠల్‌బాబు పశుగ్రాసం కోసం ఇటీవల దాదాపు లక్షన్నర రూపాయలు వెచ్చించి గడ్డిని కొనుగోలు చేసి నిల్వ చేసుకున్నాడు. ఆదివారం తెల్లవారుజామున గడ్డివాముకు మంటలు అంటుకోవడంతో బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు గుర్తించి ఆర్పేందుకు యత్నించారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో అలంపూర్ చౌరస్తా ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే దాదాపు లక్షా ఇరవై వేల రూపాయల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు. సంఘటనా స్థలానికి సమీపంలో రెండు ఎద్దులు కూడా కట్టేసి ఉన్నాయి. స్థానికులు సకాలంలో స్పందించి వాటిని పక్కకు తీసుకెళ్లడంతో ప్రాణ హాని తప్పింది. కొన్ని నెలల క్రితం ఇదే ప్రాంతంలో రెండుసార్లు అగ్ని ప్రమాదం జరిగింది. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉన్నది.

అనుమానాస్పదంగా మహిళ మృతి

బిజినేపల్లి, మార్చి 11 : కుమ్మెర మల్లయ్య జాతరలో బోనాసి మంగమ్మ (45) అనే మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై నాగేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు నాగర్‌కర్నూల్ మండలంలోని కుమ్మెర గ్రామ సమీపంలో మల్లయ్య గట్టుపై ఉన్న స్వామి ఉద్దాలు, బోనాలకు, పక్కనే ఉన్న బిజినేపల్లి మండలంలోని కారుకొండ గ్రామ శివారులో జాతరకు వేలాదిగా భక్తులు తరలి వస్తుంటారు. అందులో భాగంగానే తాడూరు మండలంలోని చెర్ల తిరుమలాపూర్ గ్రామానికి చెందిన మంగమ్మ ఆదివారం రాత్రి మల్లయ్య స్వామి దర్శనానికి వచ్చి జాతర సమీపంలోని చెట్టు కింద అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. స్థానికులు తెల్లవారు జామున గుర్తు తెలియని మహిళ శవం ఉన్నట్లు సమాచారం ఇవ్వడంతో శవ పంచనామా చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రి తరలించారు. అనంతరం శవాన్ని గుర్తించిన భర్త రాములు ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


మంగమ్మ మృతదేహం

పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

పాలమూరు యూనివర్సిటీ, మార్చి 11: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని ఏడు పీజీ పరీక్షా కేంద్రాల్లో సోమవారం పీజీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఆర్ట్స్ సైన్స్ కోర్సులతో పాటు ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు కూడా పరీక్షలు కొనసాగాయి. పరీక్షా కేంద్రాలను పీయూ వీసీ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్‌రాథోడ్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రకి రణ్, వైస్ ప్రిన్సిపాల్ ఎం. కృష్ణయ్య తనిఖీ చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజాపూర్, మార్చి 11: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని మల్లేపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకున్నది. ఎస్సై రవి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బ్యాగరి పరశురాములు (40) ఆదివారం పాముకాటుకు గురికాగా కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కొడుకు వేణుగోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పీయూ అధ్యాపకుడికి డాక్టరేట్

పాలమూరు యూనివర్సిటీ, మార్చి 11: పాలమూరు యూనివర్సిటీ ఫార్మసీ విభాగంలో అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్న ఆపుట ఈశ్వర్‌కుమార్‌కు డాక్టరేట్ వచ్చింది. సోమవారం యూనివర్సిటీలో జరిగిన ఓ కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్‌రాథోడ్ ఈశ్వర్‌కు డాక్టరేట్ పట్టాను అందజేశారు. ఫార్మసీలో 'ఫార్ములేషన్ అండ్ ఆప్టిమిజషన్ ఆఫ్ ఏతోసోమాల్ ట్రాన్సడర్మల్ పటచెస్ కంటైనింగ్ దులోక్సటీన్ అండ్ గ్లిమెపేరైడ్' అనే అంశంపై బిజూపట్నాయక్ టెక్నాలజీ యూనివర్శిటీ , ఒడిస్సాలో డాక్టర్ నిరంజన్ పాత్రో మార్గదర్శకత్వంలో ఈశ్వర్ చేసిన పరిశోధనకు గాను బిజూపట్నాయక్ యూనివర్సిటీ డాక్టరేట్ ఖరారు చేసింది. ఈ సందర్భంగా ఈశ్వర్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.


ఫార్మసీ అధ్యాపకుడు ఈశ్వర్‌కుమార్‌కు డాక్టరేట్ పత్రాలను అందజేస్తున్న పీయూ వీసీ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్‌రాథోడ్

కారు పార్టీకి ఎంపీటీసీ సభ్యుడి గుడ్‌బై


ఎమ్మెల్యే వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ఎంపీటీసీ సభ్యుడు ఆంజనేయులుచారి

బల్మూరు, మార్చి 11 : నాగర్‌కర్నూల్‌జిల్లా బల్మూరు మండల పరిధిలోని చెన్నారం ఎంపీటీసీ ఆంజనేయులుచారి కారు పార్టీకి గుడ్‌బై చెప్పి ఎమ్మెల్యే వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా వేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు ఆంజనేయులు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీకి ఎంతో పని చేసిన గుర్తింపు పొందడంలో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ప్రవర్తనతోపాటు వ్యక్తులను గౌరవించడంలో ఆయన పూర్తిగా విఫలమయ్యారని, అందువల్లే కాంగ్రెస్ పార్టీలో చేరి ప్రజలకు మరింత అభివృద్ధి చేసే విధంగా కృషి చేస్తానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సునీల్‌రెడ్డి, కిట్టు, లక్ష్మయ్యగౌడ్, మాధవయ్య, అరవింద్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జగత్‌రెడ్డి, తదితర ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

- ఇద్దరి పై కేసు నమోదు

గండీడ్ , మార్చి 11: పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు.. ఇద్దరిపై కేసు నమోదు అయిన ఘటన మండల పరిధిలోని పగిడ్యాల్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై శేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పగిడ్యాల్ గ్రామానికి చెందిన బంటు రామాంజనే యులు (19) రెండు సంవత్సరాల నుంచి అదే గ్రామానికి చెందిన అన్నసారం కృష్ణారెడ్డి దగ్గర బోరు బండిపై కూలీ పనిచేసేవాడు. పదిరోజు నుంచి బండిలో డీజిల్ దొంగతనం చేశాడనే అను మానంతో పనిలో నుంచి తొలగించి మానసికంగా హింసించారు. దాంతో యువకుడు ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి కిందపడ్డాడు. గమనించిన తల్లి వెంకటమ్మ వెంటనే 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లింది. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. శవంతో బాధిత కుటుంబ సభ్యులు కృష్ణారెడ్డి ఇంటి ముందు నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి వెళ్లి బాధితులను సముదాయించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు అన్నసారం కృష్ణా రెడ్డి, అతడి తమ్ముడు మన్యపురెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


రామాంజనేయులు (ఫైల్)

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గట్టు, మార్చి 11 : జోగుళాంబగద్వాల జిల్లా గట్టు మండల పరిధిలోని బల్గెర గ్రామంలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బల్గెర గ్రామానికి చెందిన అమరవాయి సర్వేశ్, బత్తలయ్యలు ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో కానిస్టేబుళ్లు నాగరాజు, హరికుమార్‌లు పెట్రోలింగ్ చేస్తుండగా ట్రాక్టర్‌ను గుర్తించి పట్టుకున్నారు. ఇసుకకు సంబంధించిన అనుమతులు లేక పోవడంతో ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అడవి సత్యారంలో తాగునీటి కష్టాలు

- పట్టించుకోని అధికారులు
- పొలాల వెంట పరుగులు తీస్తున్న ప్రజలు



పొలంలోని బోరు నుంచి నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్థులు

మాగనూరు, మార్చి 11 : మండలంలోని అడవి సత్యారం గ్రామంలో తాగునీటి కొరత చాలా తీవ్రంగా ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా చూసుకోవాలని ఆదేశాలు జారీ చేసినా మండల, గ్రామ స్థాయి అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. 15 రోజుల నుంచి గ్రామంలో గల వాగులో వేసిన ఫిల్టర్ బోరులో నీరు రావడం లేదని, మిషన్ భగీరథ నీటి సరఫరా కూడా అంతంత మాత్రంగానే రావడం వల్ల గ్రామస్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామంలో రెండు బోర్లు ఉన్నా, ఒక బోరులో మోటర్ ఇరుక్కుపోగా, మరో బోరులో నీళ్లు లేవని స్థానికులు తెలిపారు. ఈ విషయమై పలు మార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో పొలాల్లో వేసిన బోర్ల నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని, లేకుంటే ఆందోళన చేయాల్సి వస్తోందని గ్రామస్థులు హెచ్చరించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



తహసీల్దార్ రాణాప్రతాప్‌కు వినతి పత్రం ఇస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

నారాయణపేట, మార్చి 11 : ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రామ్ డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం పేట పుర పార్కు ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు డ్రెస్, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం శిబిరానికి వచ్చిన తహసీల్దార్ రాణా ప్రతాప్‌కు వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

నారాయణపేట, మార్చి 11 : జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి సంబంధించి ఫిజిక్స్, ఎకనామిక్స్-1 పరీక్షలు కొనసాగగా, మొత్తం 4,402 మంది విద్యార్థులకు గాను 4,188 మంది విద్యార్థులు హాజరయ్యారు. 214 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 607 మంది విద్యార్థులకు గాను 577 మంది పరీక్షలకు హాజరుకాగా, 30 మంది గైర్హాజరయ్యారు. కాగా కలెక్టర్ కోయ శ్రీహర్ష నారాయణపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎంత మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారనే విషయాన్ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో మౌలిక సదుపాయాలు పరిశీలించి ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పరీక్షలు నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. విద్యార్థుల ను తనిఖీ చేసి కేంద్రంలోకి అనుమతించాలన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేయాలి

ధన్వాడ, ఫిబ్రవరి 11 : మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు వాకిటి అంజనేయులు అన్నారు. సోమవారం ధన్వాడకు వచ్చిన వాకిటి అంజనేయులును ధన్వాడ మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు నీరటి నర్సిములు నాయుడుతో పాటు మత్స్యకారులు శాలువాతో ఘనంగ సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ఎండీ అబ్దుల్ ఖాదర్

మాగనూరు, మార్చి 11 : యువకులు మత్తు పదార్థాలైన డ్రగ్స్, గంజాయి, గుట్కా, మద్యపానం వంటి మొదలగు వాటికి దూరంగా ఉండాలని మాగనూరు ఎస్ఐ ఎండీ అబ్దుల్ ఖాదర్ అన్నారు. సోమవారం పోలీస్ కళా బృందం వారిచే సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వల్ల జరిగే అనార్థాలు, అంటరాని తనం, మూఢ నమ్మకాలు, బాల్య వివాహాలు, షీ టీం, ట్రాఫిక్ చట్టాలు, సీసీ కెమెరాలపై ఆటపాటల ద్వారా వివరించారు. మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల అనారోగ్యాలకు గురవడంతో పాటు ఆర్థికంగా కుటుంబాలు దెబ్బతింటాయన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలకు గురికాకుండా జాగ్రత్త పడాలన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. అదే విధంగా దొంతగనాల నిర్మూలన కోసం గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, కల్యాణి, రేఖ్యానాయక్ పాల్గొన్నారు.

'ఎరువుల ధర భారత్‌లోనే తక్కువ'

నారాయణపేట, మార్చి 11 : వ్యవసాయానికి ప్రాధాన్యత నిస్తూ ప్రధాని మోదీ అన్ని దేశాల కంటే భారత్‌లోనే రైతులకు అతి తక్కువ ధరకు ఎరువులు అందిస్తున్నారని బీజేపీ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ నందు నామాజీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ దేశాలతో పోలిస్తే దేశంలోనే ఎరువుల ధరలు తక్కువ అన్నారు. మోదీ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం ఏమీ కావాలని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్, విపక్షాలు కృత్రిమ రైతు ఉద్యమాలు చేయించి ఎన్నికలకు ముందే కేంద్ర ప్రభుత్వాన్ని బదనాం చేయడానికి కుట్రలు పన్నుతున్నారని, రైతులు వాస్తవాలను గుర్తించి కుట్రలను తిప్పికొట్టి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి

నారాయణపేట టౌన్, మార్చి 11 : మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐద్వా, టీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పేట సిటిజన్స్ క్లబ్‌లో మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. దేశంలో పురుషులకు సమానంగా సమాన పనికి సమాన వేతనం మహిళలకు ఇవ్వాలని, వరకట్న నిషేధ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో లలితమ్మ, జయంతి, దానమ్మ, వ్యవసాయ, సీఐటీయూ నాయకులు గోపాల్, వెంకట్రామ్‌రెడ్డి, బాల్‌రామ్, జోషి, దస్తప్ప పాల్గొన్నారు.

అన్ని కార్యక్రమాలు వెబ్‌సైట్‌లో
పొందుపరచాలి

- అధికారుల సమీక్షా సమావేశంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష



ప్రజావాణి హాల్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

నారాయణపేట టౌన్, మార్చి 11 : ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించినా వాటి ఫొటోలను జిల్లా వెబ్‌సైట్‌లో పొందుపరచాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నారాయణపేట జిల్లాకు సంబంధించి అధికార వెబ్‌సైట్‌ను అప్‌డేట్ చేయాలని, ఆర్టీఐ చట్టం కింద వచ్చిన దరఖాస్తులను క్లియర్ చేయాలని, హైదరాబాద్ నుంచి వచ్చే ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలించి ఎండార్స్ చేసి కలెక్టరేట్‌కు పంపాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు ఎపిక్స్ ఇవ్వాలని, ఉత్తమ పంచాయతీ అవార్డు కోసం ఆన్‌లైన్‌లో వివరాలను జిల్లా పంచాయతీ అధికారికి పంపాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఏవో నర్సింగ్‌రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు లేని గ్రామాలుగా మార్చాలి

మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని ఐసీడీఎస్, ఐసీపీఎస్, డీహెచ్‌ఈడబ్ల్యూ చైల్డ్ హెల్ప్ లైన్ విభాగాల ఉద్యోగ సిబ్బంది సమన్వయంతో పనిచేసి, జిల్లాలో బాల్య వివాహాలు లేని గ్రామాలుగా మార్చాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో బచ్‌పన్ బచావో ఆందోళన్ టీం సమావేశంలో కలెక్టర్ పాల్గొని, మాట్లాడారు. జిల్లాలో బడి బయట ఉన్న సుమారు రెండు వేల బాలికలకు సంబంధించి సమాచారాన్ని సేకరించి వారి వివరాలతో కూడిన జాబితాను తయారు చేయాలన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 324 బాలిక మండలి కమిటీల సమావేశాలను ఎజెండాతో నిర్వహించాలన్నారు. గ్రామాలు, మండలాల వారిగా సమావేశం నిర్వహించి బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. జిల్లాలో జరిగే పెళ్లిళ్ల రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకునేలా అవగాహన కల్పించాలని, ఆధార్ కేంద్రాల్లో వయసు పెంచి ఆధార్ కార్డు జారీ చేయకుండా నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేయాలని సమన్వయకర్త వెంకటేశ్వర్లు కలెక్టర్‌ను కోరారు. అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. సమావేశంలో డీడబ్ల్యూవో నరసింహా రావు, ఐసీపీఎస్ కవిత, కరిష్మా, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పుర కార్యాలయం తనిఖీ

నారాయణపేట పుర కార్యాలయాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ తనిఖీ చేసిన సమయంలో కార్యాలయంలో ఒకరిద్దరు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, అటెండర్లు తప్ప వివిధ సెక్షన్లలోని అధికారులు, ఉద్యోగులు లేకుండా పోయారు. కలెక్టర్ హాజరు రిజిస్టర్‌తో పాటు బయోమెట్రిక్ హాజరు యంత్రాన్ని పరిశీలించారు. ముందస్తు సమాచారం లేకుండా కార్యాలయానికి హాజరు కాని అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి సంబంధించి రెండు రోజుల వేతనాన్ని నిలిపి వేయాలని ఆదేశించారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కౌంటర్‌ను ఎవరు నిర్వహిస్తున్నారని ఆరా తీశారు. కార్యాలయంలోని వివిధ విభాగాలను కలెక్టర్ పరిశీలించి అధికారులు నిర్వహిస్తున్న విధుల గురించి ఆరా తీశారు. కమిషనర్ 13వ తేదీ వరకు సెలవు పెట్టారని సిబ్బంది కలెక్టర్‌కు వివరించారు.

నిర్వాసిత గ్రామాలను ఆదుకుంటాం

- మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి
- రేపు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాక



విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, కాంగ్రెస్ నాయకులు

మక్తల్, మార్చి 11 : సంగంబండ రిజర్వాయర్ నిర్వాసిత గ్రామాలైన సంగంబండ ఉజ్జెల్లి, గార్లపల్లితో పాటు అనుగొండ, దాదన్‌పల్లి, భూత్పూర్ వాసులను ఆదుకునేందుకు చర్యలు చేపడుతానని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం సంగంబండ రిజర్వాయర్ వద్ద హెలీప్యాడ్, సభాస్థలి, వేదికను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే సంగంబండ ముంపు గ్రామస్థులకు రావల్సిన కూలీ డబ్బులను వారి ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బండను సాకుగా పెట్టుకొని ఓట్లు వేయించుకున్నారు తప్ప బండ తొలగించలేదన్నారు. సంగంబండ రిజర్వాయర్‌లో లెవల్ కెనాల్ పనుల్లో భాగంగా సుమారు 400 మీటర్ల బండరాయిని తొలగించే పనులకు శ్రీకారం చుట్టేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుధవారం వస్తున్నట్లు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. రిజర్వాయర్ గేట్లు, హరిత హోటల్ తదితర వాటిని పరిశీలించారు. మక్తల్, పేట, కొడంగల్ పథకం మక్తల్ మండలంలోని భూత్పూర్ రిజర్వాయర్ నుంచి ప్రారంభం అవుతుందన్నారు. సుమారు 30 వేల ఎకరాలు ఊట్కూర్, మక్తల్ మండలాల్లో ప్రారంభం అవుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాలకృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, గోపాల్‌రెడ్డి, సత్యారెడ్డి, కట్ట సురేష్‌కుమార్ గుప్తా, చెన్నారెడ్డి, కావలి తాయప్ప, కావలి శ్రీహరి, కావలి అంజనేయులు, కేశవరెడ్డి, కల్లూరి గోవర్దన్ పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



జక్లేర్ న్యూ శాంతినికేతన్, బోయిన్‌పల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు

మక్తల్, మార్చి 11 : మక్తల్ మండలం జక్లేర్ న్యూ శాంతినికేతన్ పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌గా శరణ్య, డీఈవోగా నర్సింహారెడ్డి, ఎంఈవోగా భాస్కర్, ప్రిన్సిపాల్‌గా యశ్వంత్‌రెడ్డి, పీఈటీలుగా విజయ్, ఆదిత్య, ఉపాధ్యాయులుగా భవానీ, అనిల్, తౌఫిక్, ప్రణితారెడ్డి, అక్షిత, ఆకృతి, అమృత, హరినాథ్ గౌడ్, శశికాంత్ గౌడ్, వైష్ణవి, శ్రీకాంత్, బన్ని, కలీల్, ఆదిత్య, సాయికృష్ణ, జస్వంత్, భానుప్రసాద్ వ్యవహరించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భీంరెడ్డి, అధ్యాపకులు సిద్రామ్, మహేష్ గౌడ్, ప్రభావతి, రాధిక, అనిత, అరుణ పాల్గొన్నారు.

● నారాయణపేట రూరల్ : మండలంలోని బోయిన్‌పల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా ఆకాశ్, డీఈవోగా లక్ష్మి, ఎంఈవోగా అనూష, హెచ్‌ఎంగా చంద్రకాంత్, ఉపాధ్యాయులుగా శివాని, శ్రీలత, శ్రావణి, వైష్ణవి, శిరీష, విజయ్, శ్రీకాంత్, ఆంజనేయులు, సాయి కుమార్, శివానంద, అనిత, అరుణ, రేణుక వ్యవహరించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. హెచ్‌ఎం బనదయ్య, ఉపాధ్యాయులు శ్రీలత, శ్రీనివాస్‌రెడ్డి, నవీనత పాల్గొన్నారు.

ఎలక్టోరల్ బాండ్ల వివరాలు బహిర్గత పరచాలి



దామరగిద్ద ఎస్‌బీఐ ముందు నిరసన చేపట్టిన సీపీఎం నాయకులు

దామరగిద్ద, మార్చి 11 : సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం ఇచ్చిన గడువులోపు ఎలక్టోరల్ బాండ్ల వివరాలను బహిర్గత పరచాలని సీపీఎం మండల కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. సీపీఎం కేంద్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం దామరగిద్ద ఎస్‌బీఐ బ్యాంకు ముందు ఆందోళన నిర్వహించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్టోరల్ బాండ్ల ద్వారా విరాళాల సేకరణ రాజ్యాంగ విరుద్ధమని, ఐదుగురు సభ్యులతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం వ్యతిరేకించిందన్నారు. ఎలక్టోరల్ విధానాన్ని రద్దు చేసి కార్పొరేట్ దాతల వివరాలు బహిరంగ పరచాలని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు. మార్చి ఆరుతో సుప్రీం కోర్టు ఇచ్చిన గడువు తీరిందని, కానీ ఎస్‌బీఐ బ్యాంకు ఇంకా మూడు నెలల సమయం కావాలని సుప్రీం కోర్టులో పిటీషన్ దాఖలు చేయడం హాస్యాస్పదం అన్నారు. బ్యాంకు మొత్తం డిజిటల్ పద్ధతిలో తన కార్యకలాపాలు కొనసాగిస్తున్నదని అటువంటప్పుడు ఎందుకు ఆలస్యం అవుతుందని ప్రశ్నించారు. కేవలం ఎలక్టోరల్ బాండ్ల నిర్వహణ కోసం ఐటీ సిస్టమ్ అభివృద్ధి చేయడానికి ఎస్‌బీఐ సుమారు రూ.60 లక్షలు ఖర్చు చేసిందని, దాని నిర్వహణకు మరో రూ.89 లక్షలు ఖర్చు చేసిందన్నారు. ఏ రాజకీయ పార్టీ ఏయే వ్యక్తుల ద్వారా ఎంత విరాళాలను సేకరిస్తుందో తెలుసుకోవడం ప్రజల ప్రాథమిక హక్కు అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ దాతలు ఎస్‌బీఐపై ఒత్తిడి తీసుకొచ్చి వివరాలను వెల్లడించకుండా చేసే ప్రయత్నం జరుగుతుందన్నారు. సీపీఎం నాయకులు అంజిలయ్య గౌడ్, జోషి, మోహన్, నారాయణ, వెంకటప్ప పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



బాపన్‌పల్లిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బాల్‌రెడ్డి

మరికల్, మార్చి 11 : గ్రామ అభివృద్ధిలో భాగంగా మండల కేంద్రంలో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ జిల్లా నాయకుడు సూర్యమోహన్‌రెడ్డి, మండలాధ్యక్షుడు వీరన్న సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో ఏడవ వార్డులోని రామకృష్ణారెడ్డి ఇంటి నుంచి మొగులాలీ మసీదు వరకు రూ.20 లక్షలు నిధులు మంజూరు కాగా, పల్లెగడ్డ గ్రామంలో రూ.10 లక్షల సీసీ రోడ్డు పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో నాలుగు అమలు చేయడం జరిగిందని, మిగిలిన రెండు గ్యారెంటీల అమలు దిశగా ముందుకెళ్తున్నాడన్నారు. మండలాభివృద్ధి కాంగ్రెస్ హయాంలోనే సాధ్యం అన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శ్రీనివాసులు, రాములు, రాయుడు, పాండు, కృష్ణయ్య రామకృష్ణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

● దామరగిద్ద : మండలంలోని బాపన్‌పల్లి గ్రామంలో ఎన్‌ఆర్‌జీఎస్ కింద సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పుట్టి ఈదప్ప సోమవారం కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాలుగా నారాయణపేట జిల్లా అభివృద్ధికి నోచుకోలేదని, ఇక నుంచి కాంగ్రెస్ ప్రజాపాలనలో గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. పార్టీలకు అతీతంగా బాపన్‌పల్లి గ్రామాభివృద్ధికి అందరు కలిసిరావాలని కోరారు. ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మీశేఖర్, శరణ్‌నాయక్, నర్సింహులు పాల్గొన్నారు.



మరికల్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొనసాగుతున్న ధాన్యం విక్రయాలు

నారాయణపేట, మార్చి 11 : నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం ధాన్యం విక్రయాలు కొనసాగాయి. వేరుశనగలు 95 క్వింటాళ్లు విక్రయానికి రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.6,400, కనిష్ఠంగా రూ.4,020, రమారమి రూ.6,400 పలికింది. జొన్నలు 106 క్వింటాళ్లు విక్రయానికి రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.5,001, కనిష్ఠంగా రూ.3,819, రమారమి రూ.4,909, పెసర్లు 22 క్వింటాళ్లు విక్రయానికి రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.8,731, కనిష్ఠంగా రూ.2,811, రమారమిగా రూ.8,705, అలసందలు 13 క్వింటాళ్లు విక్రయానికి రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.7,916, కనిష్ఠంగా రూ.7659, ఎర్ర కందులు మూడు క్వింటాళ్లు రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠ, కనిష్ఠంగా రూ.9,881 పలికింది.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం



మహిళా ఉపాధ్యాయులను సన్మానించిన హెచ్‌ఎం నర్సింగప్ప

ఊట్కూర్, మార్చి 11 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని మల్లెపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తున్న మహిళా ఉపాధ్యాయులు వసుంధర, స్రవంతిని ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం నర్సింగప్ప మాట్లాడుతూ ఎక్కడ మహిళలు గౌరవించబడుతారో అక్కడే దేవతలు సంచరిస్తారనే నానుడి అక్షర సత్యం అన్నారు. భరతుడు పరిపాలించిన ఈ ప్రాంతాన్ని భారత దేశం అనే పేరు ఉన్నా భారత మాతగా ఒక స్త్రీ పేరుతోనే దేశాన్ని ప్రేమించే గొప్ప సంస్కృతి మనది అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణ, అహెమద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

మాగనూరు, మార్చి 11 : ధైర్యంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సీఐ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని వడ్వాట్ గ్రామంలో పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజల్లో ఆత్మ విశ్వాసాన్ని నింపి, శాంతియుత వాతావరణంలో లోక్‌సభ ఎన్నికలు నిర్వహించడానికి జిల్లా పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంతో పాటు ప్రజలందరికీ జిల్లా పోలీసులు ఎల్లవేళలా తోడుంటారని, ప్రజల్లో ధైర్యాన్ని కల్పించడానికి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాగనూరు ఎస్ఐ ఎండీ అబ్దుల్‌ఖాదర్, కేంద్ర సాయుధ బలగాలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి ఆలయంలో విద్యార్థుల నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

మక్తల్, మార్చి 11 : ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాళహస్తి ఆలయంలో సోమవారం మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మక్తల్ పట్టణం ఆద్య నృత్యాలయ క్లాసికల్ నృత్య అకాడమీ గురువు జోషి హారతీ ఆధ్వర్యంలో సాయి సప్తశ్రీ, ఆద్య సహస్ర, నిహారిక, అక్షిత బృందం శివపార్వతుల కల్యాణం, బస్మాసుర వధ నృత్య ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహణ అధికారి నృత్య ప్రదర్శన మెచ్చుకొని ప్రశంసా పత్రం, మెడల్స్ అందించినట్లు నాట్య గురువులు జోషి హారతి తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు పసుల రంజిత్‌రెడ్డి, మానస, డాక్టర్ నాగరత్న, వాణి, దినేష్, జయశ్రీ పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి



పశువులకు టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది

మాగనూరు, మార్చి 11 : రైతులు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పకుండా వేయించాలని మాగనూరు పశుసంవర్ధక శాఖ డాక్టర్ వంశీకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రైతుల పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ఉచితంగా టీకాలు పంపిణీ చేస్తోందని, దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

● కృష్ణ : మండలంలోని చేగుంట గ్రామంలో సోమవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పంపిణీ చేసినట్లు పశువైద్య సిబ్బంది లింగన్న తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా పాడి రైతుల పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ఉండేందుకు వ్యాధి నివారణ టీకాలు ఇస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.